Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్ | సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 299
పేజీలు : 3
సోమవారం 01.06.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ




## అమెరికాతో రాజీకి
# ఇరాన్ ససేమిరా





- హర్మూజ్ యథాస్థితిపై ఐఆర్‌జీసీ సరికొత్త ప్రతిపాదన-
- అణ్వాయుధాలు ఉండబోవన్న హామీ తప్పనిసరి: ట్రంప్

**టి మీడియా, మే 31, ఢిల్లీ బ్యూరో :** అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న శాంతి చర్చల నేపథ్యంలో ఇరాన్‌కు చెందిన మిలిటెంట్ స్వభావంతో ఉన్న కొన్ని అధికారిక వర్గాలు(హార్డ్‌లైనర్స్) అగ్రరాజ్యంతో ఎలాంటి రాజీకి సిద్ధంగా లేవని ప్రముఖ థింక్‌ట్యాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ వార్ క్రిటికల్ థ్రెట్స్ ప్రాజెక్ట్ విశ్లేషించింది. ముఖ్యంగా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కు చెందిన ఉన్నతాధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేందుకు సిద్ధంగా లేరని స్పష్టం చేసింది. ఎలాంటి రాయితీలు ఇవ్వడానికి ఐఆర్‌జీసీ ఆసక్తి చూపడం లేదని నివేదిక పేర్కొంది. ఐఎస్‌డబ్ల్యూ-సీటీపీ ప్రకారం, హర్మూజ్ జలసంధి గుండా జరిగే సముద్ర రవాణాపై ఆధిపత్యాన్ని చూపించేందుకు ఐఆర్‌జీసీ కొత్త యథాతథ స్థితిని ప్రతిపాదించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోంది. ఆ విధానాన్ని అమెరికాతో పాటు అంతర్జాతీయ సమాజం తిరస్కరించాలని నివేదిక సూచించింది. అంతర్జాతీయ జలాల్లో నావిగేషన్ స్వేచ్ఛకు ఇది ప్రమాదకరమైన ఉదాహరణగా మారుతుందని హెచ్చరించింది. నివేదికలో మరో కీలక అంశంగా ఇరాన్‌లోని హార్డ్‌లైన్ వర్గం ఏకరూపంగా లేదని, అందులో విభిన్న అభిప్రాయాలు, ప్రాధాన్యతలు కలిగిన వర్గాలు ఉన్నాయని పేర్కొంది. అయితే ఐఆర్‌జీసీ కమాండర్ మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీతో పాటు ఆయనకు సన్నిహితంగా ఉన్న నాయకత్వ వర్గం అమెరికాతో చర్చల్లో రాజీకి సిద్ధంగా లేదని స్పష్టం చేసింది.

### ఒప్పందం కుదిరే అవకాశం!

అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, చర్చలు విఫలమైతే సైనిక చర్య కూడా ఒక ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు. అయితే ఎలాంటి ఒప్పందమైనా ఇరాన్ అణ్వాయుధాలు అభివృద్ధి చేయదన్న స్పష్టమైన హామీపై ఆధారపడి ఉండాలని చెప్పారు.

"మేము ఒక మంచి ఒప్పందం వైపు వెళ్తున్నాం. అది సాధ్యం కాకపోతే ఇతర మార్గాలను పరిశీలిస్తాం. కానీ అణ్వాయుధాలు ఉండకూడదన్న హామీ మాత్రం తప్పనిసరి" అని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని ఇప్పటికే బలహీనపరిచామని ఆయన వ్యాఖ్యానించారు. ఒప్పందం కుదిరితే హర్మూజ్ జలసంధి వెంటనే తెరుచుకునే అవకాశం ఉంటుందని కూడా చెప్పారు. అమెరికా మీడియా సంస్థ ఆక్సియోస్ కథనం ప్రకారం, ఇరాన్ ప్రతినిధులతో జరిగిన చర్చల అనంతరం సిద్ధమైన ముసాయిదా ఒప్పందంలో కొన్ని మార్పులు చేయాలని ట్రంప్ కోరినట్లు సమాచారం. ముఖ్యంగా ఇరాన్ వద్ద ఉన్న అణు పదార్థాల అంశంలో మరింత కఠినమైన నిబంధనలు ఉండాలని ఆయన భావిస్తున్నట్లు అమెరికా అధికారులు వెల్లడించారు.

### కొన్ని సవరణలు

అలాగే హర్మూజ్ జలసంధి పునఃప్రారంభానికి సంబంధించిన విషయంలో కొన్ని సవరణలు చేయాలని ట్రంప్ కోరినట్లు తెలుస్తోంది. దీంతో ఇరుపక్షాల మధ్య మరోసారి చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రక్రియ మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు, అమెరికా ప్రభుత్వం ఇరాన్‌కు అనుబంధంగా పనిచేస్తోందని ఆరోపిస్తున్న ఒక సేకరణ నెట్‌వర్క్‌పై కొత్త ఆంక్షలు విధించింది. అమెరికా కంపెనీలుగా నటిస్తూ సున్నితమైన సాంకేతిక పరికరాలను మోసపూరితంగా సంపాదించి, వాటిని ఇరాన్ రక్షణ రంగానికి చేరవేసినట్లు ఆ నెట్‌వర్క్‌పై ఆరోపణలు ఉన్నాయి. అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఈ నెట్‌వర్క్ ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖ మరియు సాయుధ దళాల లాజిస్టిక్స్ విభాగం తరపున పనిచేసినట్లు గుర్తించారు. అమెరికాలోని పలు టెక్నాలజీ సంస్థలను మోసం చేసి మిలియన్ల డాలర్ల విలువైన పరికరాలను సేకరించినట్లు ఆరోపించారు. ఈ నెట్‌వర్క్‌కు ఇరాన్‌కు చెందిన అలీ మజ్ద్ సెపెహర్ నాయకత్వం వహించినట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. స్పెక్ట్రం అనలైజర్లు, భద్రతా గుర్తింపు పరికరాలు వంటి అధునాతన సాంకేతిక ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి అమెరికా సంస్థలను మభ్యపెట్టినట్లు తెలిపారు.

### ఆంక్షలు అందుకే!

సేకరించిన పరికరాలను ముందుగా దుబాయ్‌లోని మధ్యవర్తుల వద్దకు పంపించి, అక్కడి నుంచి ఇరాన్‌కు అక్రమంగా తరలించినట్లు అమెరికా ఆరోపించింది. ఈ చర్యలు అమెరికా ఆంక్షలను ఉల్లంఘించడమే కాకుండా జాతీయ భద్రతకు ముప్పుగా మారాయని పేర్కొంది. ఇరాన్ కార్యకలాపాలను అడ్డుకునేందుకు ఎకనామిక్ ఫ్యూరీ పేరుతో కొనసాగిస్తున్న ఒత్తిడి కార్యక్రమంలో భాగంగానే ఈ ఆంక్షలు విధించినట్లు అమెరికా వెల్లడించింది. అలాగే ఐఆర్‌జీసీ ఆర్థిక వ్యవస్థలను భంగపరచేందుకు ఉపయోగపడే సమాచారం అందించిన వారికి 1.5 కోట్ల డాలర్ల వరకు బహుమతి ఇస్తామని రివార్డ్స్ ఫర్ జస్టిస్ కార్యక్రమం ప్రకటించింది. అమెరికా-ఇరాన్ చర్చలు ఒకవైపు కొనసాగుతుండగా, మరోవైపు ఆంక్షలు, హెచ్చరికలు కూడా కొనసాగడం ప్రాంతీయ ఉద్రిక్తతలకు కొత్త మలుపు తీసుకొస్తోంది. అయితే ఇరుపక్షాలు చర్చల ద్వారా పరిష్కారానికి చేరుకుంటాయా లేదా అన్నది రాబోయే రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# ప్రభుత్వ వైద్య సిబ్బంది నిర్లక్ష్యం.

- పసికందు చెయ్యి తొలగించిన వైద్యులు

**టి మీడియా, మే 31, ఖమ్మం:** ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది విధి నిర్వహణలో చేసిన నిర్లక్ష్యం ఓ పసివాడి జీవితం పాలిట శాపమైంది. నెలలు నిండక ముందే ఈ లోకంలోకి వచ్చిన ఓ పసికందు అంగవైకల్యానికి కారణమైంది. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఓ పసికందు చేతికి ఇన్ఫెక్షన్ జరిగి చివరికి ఆ చెయ్యిని పూర్తిగా తొలగించాల్సి వచ్చింది. ఖమ్మం ప్రభుత్వ మాతాశిశు సంరక్షణ కేంద్రంలో జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఖమ్మం జిల్లా వైరా మండలం పుణ్యపురం గ్రామానికి చెందిన తలపాటి రేణుక, సత్యకాంత్ దంపతులు. ఏడు నెలల గర్భిణి అయిన రేణుక నెలలు నిండక మునుపే గత మార్చి3న ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఇద్దరు కవల అబ్బాయిలకు జన్మనిచ్చింది. ఇందులో ఓ పిల్లాడు 3 కిలోల బరువుతో ఆరోగ్యంగా ఉండగా, మరో బాబు కిలో 200 గ్రాముల బరువుతో పుట్టాడు. ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో.. తక్కువ బరువుతో పుట్టిన శిశువు మార్చి 4న ఖమ్మం ప్రభుత్వ సంరక్షణ కేంద్రంలో చేర్చారు.ఓ పిల్లాడితో రేణుక తాను ప్రసవించిన ప్రైవేటు ఆస్పత్రిలోనే ఉండిపోగా.. రేణుక బంధువు చిర్రా విజయకుమారి మాతాశిశు సంరక్షణ కేంద్రంలో ఉంచిన చిన్నారిని చూసుకున్నారు. మాతాశిశు సంరక్షణ కేంద్రంలో పసికందును ఇంక్యుబేటర్లో ఉంచిన వైద్య సిబ్బంది చికిత్స అందించారు. ఈ క్రమంలో పలుమార్లు రక్తంఎక్కించారు. అయితే, చికిత్స అనంతరం రక్తం ఎక్కించేందుకు పిల్లాడి ఎడమ చేతికి కాన్యులా పెట్టారు. తర్వాత చిన్నారి కాన్యూలా పెట్టిన ప్రాంతంలో వాపు చేసింది. వాపును గమనించిన విజయకుమారి విషయాన్ని డ్యూటీ డాక్టర్ దృష్టికి తీసుకెళ్లగా దానికేం కాదులే" అని ఓ ఆయింట్మెంట్ రాసి సరిపెట్టారు. మూడు రోజులు గడిచినా వాపు తగ్గకపోగా, చేయి నల్ల బడడం మొదలైంది. ఈ విషయాన్ని వైద్యుల దృష్టికి తీసుకెళ్లగా.. ప్రైవేటులో స్కానింగ్ తీయించుకుని రండి. 'అంటూ వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.అయితే, శిశువు చెయ్యిలో కదలిక లేదని, పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, కణజాల క్షీణత బారిన పడి శిశువు చెయ్యి దెబ్బతిందని స్కానింగ్ రిపోర్టులద్వారా తేలింది. దీంతో మాతా శిశు సంరక్షణ కేంద్రం వైద్య సిబ్బంది.. సాధారణ వాపేనని, శిశువు హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలిస్తే అక్కడి వైద్యులు నయం చేస్తారని నమ్మబలికి మార్చి 26వ తేదీ రాత్రి ఆ పసికందును అంబులెన్స్ లో హైదరాబాద్‌కు పంపించేశారు. శిశువును పరీక్షించిన నీలోఫర్ వైద్యులు.. ఇన్ఫెక్షన్ బాగా వ్యాపించిందని, చెయ్యిని పూర్తిగా తొలగించాలని చెప్పారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో శిశువు చేతిని తొలగించేందుకు అంగీకారం తెలిపారు. దీంతో నీలోఫర్ వైద్యులు శస్త్ర చికిత్స చేసి శిశువు ఎడమ చెయ్యిని భుజం వరకు తొలగించారు. ఖమ్మం ఎంసీహెచ్ వైద్యుల నిర్లక్ష్యం తమ చిన్నారిని అంగవైకల్యానికి గురి చేసిందని తల్లి దండ్రులు కన్నీటిపర్యంతమవుతున్నారు . ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

## అరచేతిలో స్వర్గం,
# వెళ్లి చూస్తే నరకం

- ఉపాధి పేరుతో ఏజెంట్లు మోసాలు



**టి మీడియా, మే 31, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ నుంచి అనేక మంది ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారు. ఇందుకోసం రూ.లక్షలు అప్పుచేస్తున్నారు. నిరుద్యోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని నకిలీ ఏజెంట్లు నిండా ముంచుతున్నారు. అరచేతిలో స్వర్గం చూపిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. అనంతరం ఆయా దేశాలు చేరుకున్నాక ఉపాధి చూపించకుండా ముఖం చాటేస్తున్నారు.

### తిరిగి రావడానికి కష్టాలు

నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోయి, వెనక్కి రాలేక అక్కడే చిన్నాచితక పనులు చేస్తూ నెట్టుకొస్తున్నారు. అక్కడ కూడా మోసాలకు బలవుతున్నారు. సరిగ్గా వేతనం అందక.. ఎవరికి చెప్పుకోవాలో తెలియక లబోదిబోమంటున్నారు. అక్కడ నుంచి బయటపడేందుకు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు.

### ఒక్కో వ్యక్తి నుంచి రూ.1.10 లక్షలు వసూలు

ఉమ్మడి నిజామాబాద్? జిల్లా నుంచి ఉపాధి కోసం సుమారుగా 1.80 లక్షల మంది వరకు గల్ఫ్ దేశాలకు వెళ్లారు. అక్కడ అనేక మంది భవన నిర్మాణ కార్మికులుగా, పశువుల కాపరులుగా, డ్రైవర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా కొనసాగుతూ జీవనం సాగిస్తున్నారు. జిల్లాలోని మోపాల్? మండలానికి చెందిన ఓ ఏజెంటు ఒక్కో వ్యక్తి నుంచి రూ.1.10 లక్షలు వసూలు చేసి, వారిని ఒమన్? దేశానికి పంపుతున్నాడు. అయితే అక్కడికి చట్టరుకున్న తర్వాత కొన్ని నెలలే పని లభిస్తోంది. మిగిలిన రోజులు ఉపాధి దొరక్క అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయమై ఏజెంట్లను సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నా.. వారు మొహం చాటేస్తున్నారు.

**పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న ఏజెంట్లు :** ఇలాంటి ఘటనలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిత్యం ఏదో ఒక గ్రామంలో వెలుగుచూస్తునే ఉన్నాయి. కన్సల్టెన్సీ కంపెనీల ప్రతినిధులు, ఏజెంట్లు ఇక్కడి వారికి విదేశాలకు పంపించి ఆపై పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అయితే అక్కడి సంస్థ ఉద్యోగం ఇవ్వడంలేదని, తక్కువ జీతం ఇస్తోందని, సరైన

మిగతా 3లో..

## ధవళేశ్వరం బ్యారేజీ నుంచి
# ఖరీఫ్‌కు సాగునీరు విడుదల

- హర్షం వ్యక్తం చేసిన రైతులు



**టి మీడియా, మే 31, ధవళేశ్వరం :** నీటిపారుదల వ్యవస్థపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని మంత్రి కందుల దుర్గేశ్ ఈ సందర్భంగా వెల్లడించారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు ఆయన సాగునీరు విడుదల చేశారు. అనంతరం మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల మేలును కోరే ప్రభుత్వమని ప్రస్తావించారు. మంత్రి కందుల దుర్గేశ్?తో పాటు కూటమి ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రత్యేకపూజలను నిర్వహించారు. ఆపై గోదావరికి జలహారతి ఇచ్చి మీట నొక్కి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టా కాలువకు నీటి విడుదలతో తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఆయకట్టు రైతులు ఎంతగానో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### ఖరీఫ్‌కు సాగునీరు విడుదల

తుపానులు, ప్రకృతి వైపరీత్యాల నుంచి

మిగతా 3లో..



# రూ.5వేలు ఉంటే చాలు

## ● పోస్టాఫీస్ ఫ్రాంచైజీ బిజినెస్

**టి మీడియా, మే 31, వాణిజ్యం :** భారతీయ తపాలా శాఖ దేశ పౌరుల కోసం పలు రకాల పథకాలను నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. ఎటువంటి రిస్కూ లేకుండా ఆయా స్కీమ్స్ ద్వారా గ్యారెంటీ రిటర్న్ పొందవచ్చు. అందుకే పోస్టాఫీసు పథకాల్లో పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుంది. అయితే, కేవలం పొదుపు పథకాలు మాత్రమే కాకుండా, సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనుకునే సరికొత్త అవకాశాలను సైతం కల్పిస్తోంది. అదే ప్రోస్టాఫీసు "ఫ్రాంచైజీ స్కీమ్ 2.0". చాలా తక్కువ పెట్టుబడితో ఈ ఫ్రాంచైజీ ద్వారా ఇంటి వద్ద నుంచే ఆదాయాన్ని పొందవచ్చు. మరి, ఈ స్కీమ్? వివరాలు ఏంటి? ఎవరు అర్హులు? డబ్బులు ఎలా సంపాదించాలి? అనే మరిన్ని వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.నేటి డిజిటల్? యుగంలో తన సేవల్ని మరింత వేగవంతం చేసే దిశగా తపాలాశాఖ అడుగులేస్తోంది. ఈ-కామర్స్ రంగంలో పెరుగుతున్న పోటీని తట్టుకుని ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు




"ఫ్రాంచైజీ స్కీమ్? 2.0"ను అందుబాటులోకి తెచ్చింది. నిజానికి ఈ స్కీమ్? ఎప్పటినుంచో ఉన్నా.. సరికొత్తగా అప్?డేట్? చేసి 2.0ని జనవరి 1, 2026 నుంచి అందుబాటులోకి తీసుకొచ్చింది. కొరియర్, ఎక్స్‌ప్రెస్, పార్సిల్ విభాగంలో సేవల్ని బలోపేతం చేయడం కోసం ఈ పథకానికి రూపకల్పన చేసింది. అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ ని ఉపయోగించి ఆధునిక, పారదర్శక, పౌర కేంద్రిత సేవలను అందించడమే దీని ప్రధానం లక్ష్యం.

### ఏఏ సేవలు అందించవచ్చు

స్పీడ్ పోస్ట్ డాక్యుమెంట్ బుకింగ్, స్పీడ్ పోస్ట్ పార్సిల్ బుకింగ్, ఇండియా పోస్ట్ పార్సిల్ సేవలు, ఇంటర్నేషనల్ ఈఎమ్ఎస్, ఐటీపీఎస్ సేవలు, క్లిక్ అండ్ బుక్, పిక్-అప్ సేవలు, క్యాష్ ఆన్ డెలివరీ, ఇంటివద్ద నుంచే పార్సిల్ సేకరణ ఇలా రకరకాల సేవలను ఈ స్కీమ్? ద్వారా ప్రజలకు అందించవచ్చు.

ఫ్రాంచైజీ రకాలు: గతంలో లాగా కేవలం ఒకే కౌంటర్ సర్వీస్ కాకుండా, కొత్త నిబంధనల ప్రకారం ఫ్రాంచైజీదారులు తమ సౌలభ్యాన్ని బట్టి 4 రకాల సేవలను ఎంచుకోవచ్చు

బుకింగ్ మాత్రమే: స్పీడ్ పోస్ట్, పార్సిల్స్ వంటివి బుక్ చేయడం.

డెలివరీ మాత్రమే: మీ పరిధిలోని పార్సిళ్లను కస్టమర్ల ఇళ్లకు డెలివరీ చేయడం. పికప్ మాత్రమే : ఈ-కామర్స్ వ్యాపారుల దగ్గరకు వెళ్లి పార్సిళ్లను సేకరించడం. అన్ని సేవలు కలిపి బుకింగ్, పికప్, డెలివరీ అన్నీ కలిపి ఒకే అవుట్‌లెట్ ద్వారా నిర్వహించడం.

### ఫ్రాంచైజీ కోసం కావాల్సిన సదుపాయాలు

ఎంచుకునే సేవలను బట్టి సదుపాయాలు మారతాయని అధికారులు చెబుతున్నారు. డెలివరీ సేవల కోసం వెహికల్? ఉంటే సరిపోతుందంటున్నారు. అదే బుకింగ్ సేవలకు చిన్న స్థలం, స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్, ఇంటర్నెట్, ప్రింటర్ వంటి మౌలిక సదుపాయాలు అవసరమని వివరిస్తున్నారు.

### ఫ్రాంచైజీ కోసం అర్హతలు

18 సంవత్సరాల వయసు కలిగిన విద్యార్థులు, నిరుద్యోగులు, చిరుద్యోగులు, మహిళలు, వర్తకులు.. ఎవరైనా ఈ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టి ఆదాయాన్ని పొందవచ్చు.బుకింగ్ సేవలు నిర్వహించాలనుకునేవారు గుర్తింపు పొందిన విద్యాసంస్థ నుంచి ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. అదే కేవలం డెలివరీ సేవలకు అయితే 10వ తరగతి ఉత్తీర్ణత సరిపోతుంది.ఈ స్కీమ్ కోసం దరఖాస్తు చేసే అభ్యర్థులకు స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్ వినియోగంపై కనీస అవగాహన ఉండాలి.

డెలివరీ సేవలకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. అలాగే సొంత వాహనం కలిగి ఉండాలి.పాన్ కార్డ్ తప్పనిసరి. పోస్టల్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఈ పథకానికి అనర్హులు.


### కమీషన్, లావాదేవీలు ఇలా

ఫ్రాంచైజీ కార్యకలాపాల ప్రకారం భద్రతా డిపాజిట్ నిర్ణయించారు. డెలివరీ, పికప్ సేవలకు రూ.5వేలు, బుకింగ్ సేవలకు రూ.10వేలు, అన్ని సేవలకు రూ.15వేలు తప్పనిసరిగా చెల్లించాలి. నిబంధనల ప్రకారం ఈ మొత్తం తిరిగి చెల్లిస్తారు. ప్రతి బుకింగ్, పికప్, డెలివరీపై కమీషన్ లభిస్తుంది. వ్యాపారం పెరిగేకొద్దీ కమీషన్ శాతం పెరుగుతుంది.ఇక క్యాష్ ఆన్ డెలివరీ సేవలకు ఎక్స్ట్రా కమీషన్ ఉంటుంది. దీనికి సంబంధించిన ట్రాన్సాక్షన్స్ అన్నీ డిజిటల్ విధానంలోనే నిర్వహిస్తారు. కొత్తగా తీసుకొచ్చిన APT 2.0 మొబైల్ యాప్, సెల్ఫ్ సర్వీస్ పోర్టల్ ద్వారా బుకింగ్‌లు నిర్వహించవచ్చు. డిజిటల్ వ్యాలెట్ ద్వారా పోస్టేజ్ చెల్లింపులు చేయవచ్చు. ప్రతి బుకింగ్‌కు సంబంధించిన సమాచారం వెంటనే సిస్టమ్‌లో అప్‌డేట్ అవుతుంది.

### ఎలా అప్లై చేసుకోవాలి

ఈ ఇండియా పోస్ట్ ఫ్రాంచైజీ నోటిఫికేషన్ ప్రతి సంవత్సరం జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబరు నెలల్లో మొదటి వారం విడుదల చేస్తారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. సెలెక్ట్? అయిన వారికి శిక్షణ ఇస్తారు. అగ్రిమెంట్ పూర్తైన 30 రోజుల్లోపు కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం కల్పిస్తారు. ఈ పథకానికి సంబంధించిన పూర్తి నిబంధనలను ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్స్ అధికారిక నోటిఫికేషన్ లింక్?పై క్లిక్? చేసి తెలుసుకోవచ్చు.

## చిత్రలేఖనంలో రష్మిత ప్రతిభకు ప్రశంసలు




**టీ మీడియా ,మే 31,పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణానికి చెందిన చిన్నారి రష్మిత చిత్రలేఖనంలో విశేష ప్రతిభ కనబరుస్తోంది పెబ్బేరు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవరశెట్టి మహేష్ రాధిక దంపతుల కుమార్తె అయిన రష్మిత తన కళా నైపుణ్యంతో అందరి ప్రశంసలు అందుకుంటోంది ఇటీవల ఆమె వేంకటేశ్వర స్వామి చిత్రాన్ని ఎంతో అందంగా గీసి ఆకట్టుకుంది చిత్రానికి ఆకర్షణీయమైన రంగులు అద్దడంతో ఆ బొమ్మ మరింత అందంగా కనిపించింది రష్మితలోని సృజనాత్మకత కళాప్రతిభను చూసిన వారు అభినందనలు తెలియజేస్తున్నారు చిన్న వయస్సులోనే ఇంతటి ప్రతిభను కనబరచడం విశేషమని పలువురు పేర్కొన్నారు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఆసక్తితో ఆమె చిత్రలేఖనంలో రాణిస్తోందని తెలిపారు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు రష్మిత ప్రతిభ పట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు పెబ్బేరు పట్టణ వాసులు ఆమెను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు

## ప్రజాపంథా నాయకుడు మోకాళ్ల రామకృష్ణ మృతి

### ● నివాళులర్పించిన టేకులగూడెం సర్పంచ్



**టీ మీడియా,మే31,సింగరేణి(కారేపల్లి):** కారేపల్లి మండలంలోని టేకులగూడెంకు చెందిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు మోకాళ్ల రామకృష్ణ (42) ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. రామకృష్ణ మృతిచెందిన విషయం తెలుసుకున్న టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రామకృష్ణ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకుడని, ఆయన మరణం బాధాకరమని పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో టేకులగూడెం ఉపసర్పంచ్ బిక్కసాని భాస్కర్‌రావు,గుమ్మడి ఎర్రయ్య,కోడెం సీతారాములు,పాయం కృష్ణ, గుమ్మడి రవి,గొగ్గెల కృష్ణ, శ్రీను,రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా గ్రామ ఉద్యోగ సంఘం




**టీ మీడియా,మే31,సింగరేణి(కారేపల్లి):** సింగరేణి మండలం గుంపెల్లగూడెం గ్రామ ఉద్యోగ సంఘం మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకుంది. ఇటీవల బైక్ ప్రమాదంలో మృతి చెందిన కున్సోత్ సీతారాములు (చినుకు) కుటుంబానికి, అలాగే అనారోగ్యంతో మరణించిన ఎర్రబెల్లి ప్రభాకర్ తల్లి కుటుంబానికి సంఘం సభ్యులు పరామర్శించి ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బానోత్ వీరన్న, ప్రధాన కార్యదర్శి గుగులోత్ శంకర్, సభ్యులు భూక్యా వీరన్న (ఆర్మీ), బానోత్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ గుగులోత్ కృష్ణవేణి--వీరబాబు ఉద్యోగ సంఘం సేవా కార్యక్రమాలను అభినందించారు. గ్రామ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ సంఘం ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శ



**టి మీడియా, మే 31,పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గొల్ల కొండన్న చనిపోయిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి వారి ఇంటికివెళ్లి కొండన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు మీ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు పరామర్శించిన వాళ్ళు గుమ్మడం కాంగ్రెస్ పార్టీ నాయకులు హరిబాబు రెడ్డి నిరంజన్ రెడ్డి బాబు రెడ్డి రాజు నాయక్ అయ్యవారిపల్లె సర్పంచ్ కురుమన్న ఎన్ ఎస్ యు ఐ నాయకులు వెంకటేష్,నందిమల్ల రాము పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పరామర్శించారు.

## డాక్టర్ కోటిరెడ్డి పదవి విరమణ వీడ్కోలు సభ .




**టీ.మీడియా,మే31,చింతూరు:** చింతూరు ప్రభుత్వ వైద్యశాలలో సూపర్ని డెంట్ డాక్టర్ కోటిరెడ్డి పదవీ బాధ్యతల నుండి ఆదివారం విరమణ పొందారు. ఈ సందర్భంగా చింతూరు ఐటీడీఏ సమావేశమందిరంలో పదవీ విరమణ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డివిజన్ లోని డాక్టర్లు, అభిమానులు, రాజకీయ నాయకులు, భద్రాచలం లోని డాక్టర్లు వందలాదిమంది సభకు హాజరై 30 సంవత్సరాలుగా కోటిరెడ్డి పేద ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసి, ఉద్యోగంలో అంకితభావంతో పని చేశారని కొనియాడారు. ప్రతి ఒక్కరు తమతో ఉన్న సంబంధ బాంధవ్యాలను వెల్లడించారు. కొంతమంది ప్రసంగిస్తూనే ఆనందభాష్పాలను రాల్చారు. చింతూరు ఆసుపత్రి అభివృద్ధి చెందటానికి ఎంతగానో శ్రమించారని తోటి ఉద్యోగస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చింతూరు ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ చదలవాడ విజయ్ కుమార్, పోలవరంజిల్లా ఏపీడబ్ల్యూజే అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రెస్ క్లబ్ సభ్యులు, ఆంధ్రజ్యోతి సీనియర్ రిపోర్టర్ మంత్రి సత్యనారాయణ, సాక్షి విలేఖరి షౌకత్ అలీ, మహాటీవి రిపోర్టర్ జీవన్ కుమార్, వెట్రన్ జర్నలిస్ట్ మనగంటి భాస్కరాచారి, బెజ్జంకి ఈశ్వరాచారి,బెజ్జంకి శ్రీనివాసాచారి, బేడే సతీష్,ఆర్ఎంపీ డాక్టర్లు వెంకన్న, పూసం రాజు, సాగర్, రమణ, లక్ష్మణ్, తదితరులు సూపర్ని డెంట్ కోటిరెడ్డి దంపతులకు శాలువా కప్పి సన్మానించారు.

## ఉచిత హెల్త్ క్యాంపు ఏర్పాటు




**టీ మీడియా, మే 31 పెబ్బేరు :** మండలంలోని గుమ్మడం తాండలో పెబ్బేరు జనని హాస్పిటల్ వారి ఉచిత మెగా హెల్త్ క్యాంపు ను డాక్టర్ జయచంద్రారెడ్డి చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ ప్రియాంకా రెడ్డి స్త్రీ వ్యాధి నిపుణురాలు ఆద్వర్యంలో నిర్వహించారు ఈ హెల్త్ చెకప్ కు పెద్ద ఎత్తున వచ్చిన గ్రామ ప్రజలకు ఉచిత మందులు పంపిణీ చేశారు గ్రామ ప్రజలు హెల్త్ క్యాంపు ను సద్వినియోగం చేసుకున్నారు ఈ కార్యక్రమంలో గుమ్మడం తండా గ్రామ సర్పంచ్ చిట్టమ్మ హనుమంతు ఉప సర్పంచ్ గోవిందు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మురికి కాలువలు లేక ప్రజలు అవస్థలు

### ● నిర్మాణం కోసం తవ్వి వదిలేసిన అధికారులు





**టీ మీడియా, మే 31, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కదుకుంట్ల గ్రామంలో మురికి కాలువలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత కొద్దిరోజుల కింద మురికి కాలువల కోసం తవ్విన కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో రోడ్డుపైన మట్టి వెయ్యడంతో వాహనదారులు, ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మురికి కాలువలు (డ్రైనేజీ) సక్రమంగా లేకపోవడం వల్ల నివాస ప్రాంతాల్లో తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇళ్ల నుండి వచ్చే మురుగు నీరు రోడ్లపై నిలిచిపోవడం, పక్కనున్న ఖాళీ స్థలాల్లో చేరడం వల్ల ఈగలు, దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. దీనివల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, కలరా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. దీనివల్ల స్థానికులు ముక్కు మూసుకొని జీవించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. మురుగు కాలువలు లేక మురికి నీరు రోడ్ల మీద పారడం వల్ల రోడ్లు పాడైపోయి జారిపడే ప్రమాదాలు జరుగుతాయి. సాయంత్రం వేళల్లో దోమల స్వైరవిహారం ఎక్కువై, చిన్న పిల్లలు, వృద్ధులు బయట తిరగడానికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తుంది. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి, ఎప్పటికప్పుడు శుభ్రం చేయదగిన పక్కా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలి. మురుగు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా ప్రవాహ మార్గాలను ఏర్పాటు చేయాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

## ఎంఎస్‌పీ పేరుతో రైతులకు అన్యాయం..

### ● కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**టీ మీడియా,మే31,సింగరేణి(కారేపల్లి):** రైతాంగం పండించే పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం గిట్టుబాటు ధర కల్పించకుండా,ఎం.ఎస్.పి పేరుతో నామమాత్రపు ధరలను ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, మాస్ లైన్ నాయకులు విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆదివారం కారేపల్లి మండల పరిధిలోని పేరుపల్లి -- అలియా తండా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో పాటు మద్దతు ధర జీవో పత్రాలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతాంగానికి లాభదాయకమైన ధరలు కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని, రైతుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై. ప్రకాష్, నాయకులు కోయల శ్రీను, కంచర్ల శ్రీనివాసరెడ్డి, వై. జానకి, కావేటి నాగేశ్వరరావు, ఆలెం చంద్రయ్య,మాస్ లైన్ నాయకులు గుగులోత్ తేజ నాయక్, ధారావత్ సక్రు, పులకాని సత్తిరెడ్డి, రావుల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

### ● సర్పంచ్ టోనీ చేతుల మీదుగా ప్రారంభం



**టీ మీడియా,మే31,సింగరేణి(కారేపల్లి):** కారేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సుమన్ ఐ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. శిబిరాన్ని సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో వైద్యులు ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అలాగే కళ్లజోడు అవసరమైన వారికి తక్కువ ధరలకు అందుబాటులో ఉంచారు. ఈ వైద్య శిబిరంలో సుమన్ ఐ కేర్ వైద్యులు డాక్టర్ అశోక్, రాజేష్, వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు మేకల కుమార్, రావుల రాజశేఖర్, అంజయ్య, సర్దార్, మహమ్మద్ యాకుబ్ అలీ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. శిబిరానికి పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు.

## ఒంటికాలి పై నిరసన



**టీ మీడియా, మే 31, కూసుమంచి :** ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్స్ ను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న శాంతియుత నిరవధిక సమ్మెలో భాగంగా 10వ రోజు ఆదివారం వి వో ఏ లు ఒంటి కాలి పై నిలబడి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందున్న సమ్మె దీక్ష శిబిరం నుంచి సంయుక్త కార్యాచరణ కమిటీ ( జాక బి సెర్ప్ ) నాయకురాళ్ళు పలువురు మాట్లాడారు. పెరిగిన ధరలకి అనుగుణంగా కనీస వేతనం 26 వేల రూపాయలకు పెంచి, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని వర్తింప చేయాలని,అర్హులైన వారికి సి సి లు గా పదోన్నతి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. 20 లక్షల రూపాయల వరకు సాధారణ ఆరోగ్య భీమా సౌకర్యం కల్పిస్తూ , ట్యాబ్ లు అందజేయాలని వారు కోరారు. , తమ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడి , 58 జి ఓ నో సవరించి , వెంటనే పరిష్కరించాలని కోరుచూ, లేనిచో నిరవధిక సమ్మె ను ఉధృతం చేస్తామని వి ఓ ఏ లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల కమిటీ అధ్యక్షురాలు వద్దే బోయిన జయమ్మ ఉపాధ్యక్షురాలు దోమల రజిని ప్రధాన కార్యదర్శి లోడిగా మంగతాయి సహాయ కార్యదర్శి ఎస్కె నసీమ కోశాధికారి గోపి ప్రమీల, వి ఓ ఏ లు బెల్లం నీలమ్మ,, నాగమణి , రేణుక, జ్యోతి , కల్పన , స్వరూప, విజయ , ప్రసన్న లక్ష్మి , అరుణ, బుజ్జి మంజుల, శ్రీదేవి, జయమ్మ , ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## బావిలో పడిన వ్యక్తిని కాపాడ బోయి మరో ప్రాణం బలి

**టీ మీడియా,మే31, ములుగు బ్యూరో:**





ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని బిసి మర్రి గూడెం గ్రామంలో బావిలో పడి ఇద్దరు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళ్తే బిసి మర్రి గూడెం గ్రామానికి చెందిన బద్ది రమేష్ 26 సంవత్సరాలు, ప్రమాదవశాత్తు మంచి నీటి బావిలో పడి పోయాడు. కాపాడండి అంటూ గట్టి గా కేకలు వేయడం తో మృతుడైనా బద్ది రమేష్ అనే వ్యక్తి ని కాపాడేందుకు రెగ నర్సింహా రావు 41సంవత్సరాలు అనే వ్యక్తి బావిలోకి దిగాడు. బావి లోతు ఎక్కువ అవడం తో బావి లోపల ఊపిరి అందక ఇద్దరు వ్యక్తులు అక్కడే మృతి చెందారు. బావిలో పడిన వ్యక్తి ని కాపాడబోయి మరో వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోవడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుము కున్నాయి. స్థానిక పోలీసులు సి ఐ ముత్యం రమేష్, ఎస్సై కె తిరుపతి రావు ఘటన స్థలాన్ని చేరుకొని మృత దేహాలను బయటకు తీసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటన పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## చీరల పంపిణీ

### ● హాజరైన ఎంఎల్ ఎ, డి సి సి చైర్మెన్

**టి మీడియా మే 31,పెబ్బేరు :** వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలోఏర్పాటు చేసిన చీరల పంపిణీ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణం స్వీకారం చేసిన వెంటనే మొ వనపర్తి నియోజకవర్గంకు సంబంధించి ఇప్పటివరకు 30 కోట్ల 29 లక్షల రూపాయలను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని ఆయన తెలిపారు. వనపర్తి నియోజకవర్గం లో 37 500 కొత్త రేషన్ కార్డులను ప్రజలకు అందజేసినట్లు ఎమ్మెల్యే వివరించారు . ఈ కార్యక్రమంలో రు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి స్థానిక కౌన్సిలర్లు, మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి మండల అధ్యక్షుడు రాంరెడ్డి , సర్పంచులు నాయకులు ,కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## బాసర త్రిపుల్ ఐటీకి ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఎంపిక

**టీ మీడియా , మే31,మహబూబాబాద్:** మహబూబాబాద్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల 11 మంది విద్యార్థులు పి.కీర్తన,జి.సిరి,ఎం.జశ్వంత్, బి. అక్షయ, ఎండి.సానియా, ఏ.ప్రహర్ష, ఏ.భానుప్రకాష్, బి.చరణ్, బి.శ్రీహారిక, జె.నవ్యశ్రీ, జి.కిరణ్ కుమార్ బాసర త్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జి. ఉపేందర్ రావు ఈ విషయాన్ని వెల్లడిస్తూ, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ఆయన అన్నారు. ఈ సందర్భంగా, ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



## కూలిన హోర్డింగ్ ఫ్రేమ్..

### ● తృటిలో తప్పించుకున్న బైకర్, స్కూటీ రైడర్

**టి మీడియా, మే 31, అహ్మదాబాద్:** బలమైన గాలులకు హోర్డింగ్ ఫ్రేమ్ కూలిపోయింది. ఆ సమయంలో రోడ్డుపై వెళ్తున్న బైకర్, స్కూటీ రైడర్ ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఈ సంఘటన జరిగింది. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు రద్దీగా ఉండే రంజిత్‌సాగర్ రోడ్డుపై ఉన్న హోర్డింగ్ ఫ్రేమ్ బలమైన గాలికి కూలిపోయింది. కాగా, రోడ్డుపై వెళ్తున్న ఒక బైకర్ కూలుతున్న హోర్డింగ్ ఫ్రేమ్ కింద నుంచి తల ఒంచి తృటిలో వేగంగా వెళ్లిపోయాడు. ఇంతలో ముగ్గురు ప్రయాణిస్తున్న స్కూటీ అక్కడకు చేరుకున్నది. ప్రమాదాన్ని పసిగట్టిన స్కూటీ రైడర్ అకస్మాత్తుగా బ్రేకులు వేశాడు. దీంతో దానిపై ఉన్న ముగ్గురు వ్యక్తులు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మిగతా వాహనదారులు రోడ్డుకు ఇరువైపులా ఆగిపోయారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# గండిపేట ల్యాండ్ స్కామ్

- మాజీ ఎమ్మెల్యే పాత్రపై ఆధారాలు దొరికాయి
- డీసీపీ శ్రీనివాస్

**టి మీడియా, మే 31, హైదరాబాద్ బ్యూరో :** గండిపేటలో రూ.1500 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జా చేసేందుకు యత్నించారు. ఈ కబ్జాలో ఏపీ వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కీలకంగా వ్యవహరించారు. భూకబ్జా వ్యవహారంలో బొల్లా బ్రహ్మనాయుడిపై ఆధారాలు లభ్యమైనట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. నకిలీ జీవో కోసం రాధాకృష్ణకు బొల్లా బ్రహ్మనాయుడు రూ.4 కోట్లు ఇచ్చినట్లు గుర్తించామని డీసీపీ వెల్లడించారు. భూమి క్రమబద్ధీకరించాలని కలెక్టర్, సీసీఎల్ఏకు దస్త్రాలు వెళ్లినట్లు సృష్టించారని తెలిపారు. రాధాకృష్ణ చెప్పిన విషయాలు, నిమ్మల కుటుంబం చెప్పిన విషయాలు సరిపోలాయని, రాధాకృష్ణ 9 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, అతని వద్ద కందుకూరు, అంబర్‌పేటలో స్థల పత్రాలు లభించాయని చెప్పారు. వివిధ నకిలీ సంస్థలను సృష్టించి స్టాంపులు తయారు చేశారని శ్రీనివాస్ వెల్లడించారు.




**లాయర్‌తో పాటు మరో ఇద్దరి సహకరం**

భూమి క్రమబద్ధీకరించాలని కలెక్టర్, సీసీఎల్ఏకు దస్త్రాలు వెళ్లినట్లు సృష్టించారని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఐఏఎస్ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి ఆర్డర్లు సృష్టించారన్నారు. మొదటి నుంచి జరిగిన ప్రక్రియకు సంబంధించిన ఆర్డర్లు సీజ్ చేశామని చెప్పారు. ఫేక్ ఆర్డర్లు తయారీలో రాధాకృష్ణ లాయర్‌తో పాటు మరో ఇద్దరు సహకరించినట్లు తేలిందని, రాధాకృష్ణ చెప్పిన విషయాలు, నిమ్మల కుటుంబం చెప్పిన విషయాలు సరిపోలాయని తెలిపారు.

**రూ.4 కోట్లు ఇచ్చినట్లు తెలుస్తోంది**

బొల్లా బ్రహ్మనాయుడు, రమేష్ పాత్రపై ఆధారాలు దొరికాయన్న డీసీపీ రాధాకృష్ణ.. భూమికి సంబంధించిన ఆర్డర్లు తయారు చేశారని స్పష్టం చేశారు. నకిలీ జీవో కోసం రాధాకృష్ణకు రూ.4 కోట్లను బ్రహ్మనాయుడు ఇచ్చారని తెలిపారు. రాధాకృష్ణ లాయర్ బృందానికి మరో రూ.4 కోట్లు ఇచ్చినట్లు తెలిసిందని చెప్పారు. నగదు రూపంలో లావాదేవీ జరిగినందున ఎక్కడికి వెళ్లాయో ట్రాక్ చేస్తున్నామని పేర్కొన్నారు.

**ఐదుగురిని అరెస్టు చేశాం**

కేసు నమోదు కాగానే పత్రాలు దాచిపెట్టాలని డ్రైవర్ ప్రవీణ్‌కు రాధాకృష్ణ చెప్పారని, పత్రాలు తరలించే క్రమంలో డ్రైవర్ ప్రవీణ్‌ను అరెస్టు చేశామని శ్రీనివాస్ అన్నారు. ఫోర్జరీ సంతకాలతో సీసీఎల్ఏ, హైడ్రా ఆఫీసులు క్లియరెన్స్ ఇచ్చినట్లు సృష్టించారని తెలిపారు. రాధాకృష్ణ 9 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని డీసీపీ తెలిపారు. రాధాకృష్ణకు సంబంధించి కందుకూరు, అంబర్‌పేటలో స్థలాల పత్రాలు లభించాయని, వివిధ నకిలీ సంస్థలు సృష్టించి స్టాంపులు తయారు చేశారని వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్టు చేశామని, ఇదే కేసులో మరో ఐదుగురిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నామని వివరించారు.

**పలు వస్తువులు స్వాధీనం**

ఈ కేసులో ఏ9 రాధాకృష్ణ, ఏ10 ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేశామని తెలిపారు. నిందితుల నుంచి భారీగా నకిలీ జీవో కాపీలు, 12 చెక్‌బుక్‌లు, 10 ఏటీఎం కార్డులు, 12 చెక్‌బుక్‌లు, 3 ల్యాప్‌టాప్‌లు, 2 ఫోన్లు, 13 స్టాంపులు, 7 బ్యాంకు పాస్‌బుక్‌లు, 10 ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## మంత్రాలయంలో విషాదం

- తుంగభద్రలో గల్లంతై ఐదుగురు మృతి



**టి మీడియా, మే 31, మంత్రాలయం :** వారంతా బంధుల ఇంట్లో నిర్వహించే శుభకార్యానికి వచ్చారు. బంధువులతో సంతోషంగా ముచ్చటించారు. ఆ తర్వాత బాలుడితో సహా ఐదుగురు వ్యక్తులు తుంగభద్ర నది చూసేందుకు వెళ్లారు. అనంతరం నీటిలోకి దిగారు. ఈ క్రమంలో బాలుడు నీటిలో కొట్టుకుపోతుండగా అతడిని కాపాడేందుకు ప్రయత్నించి మరో నలుగురు గల్లంతయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి ఐదుగురి మృతదేహాలను వెలికితీశారు. ఈ విషాద ఘటన కర్నూలు జిల్లాలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మంత్రాలయంలో కాళప్పాచారి ఇంట్లో ఆదివారం వ్రతం ఉండటంతో శనివారం నాడు బంధువులు వచ్చారు. ఇందులో ఆరుగురు వ్యక్తులు తుంగభద్ర నది చూసేందుకు శనివారం సాయంత్రం వెళ్లారు. ఆ తర్వాత నీటిలోకి దిగారు. ఈ క్రమంలో బాలుడు యువన్ చంద్ర(5) నీటిలో కొట్టుకుపోతుండగా అతడిని కాపాడేందుకు ప్రయత్నించి ఒకరి తర్వాత ఒకరు నదిలో గల్లంతయ్యారు. అపర్ణ అనే బాలిక ప్రమాదం నుంచి బయటపడి బంధువులకు సమాచారమిచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న మంత్రాలయం సీఐ దస్తగిరి బాబు, అగ్నిమాపక అధికారులు, మత్స్యకారుల సహకారంతో ఘటనా స్థలానికి చేరుకొని నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన వారు వడ్ల సతీష్(25), రాఘవేంద్ర (25), వడ్ల ధను(22), సంధ్య(21)గా గుర్తించారు. శనివారం సాయంత్రం వడ్ల ధను (22) మృతదేహాన్ని వెలికితీశారు. మిగతా వారికోసం రాత్రి 8:30 గంటల వరకు గాలించినా వారి జాడ దొరకలేదు. ఈ క్రమంలోనే ఇవాళ గాలింపు చర్యలు చేపట్టగా యువన్ చంద్ర, సతీష్ చంద్ర, రాఘవేంద్ర, సంధ్య మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్ట్?మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో సతీష్ చంద్ర, యువన్ చంద్ర తండ్రి కుమారులు కాగా మిగతా వారంతా దగ్గరి బంధువులు. దీంతో శుభకార్యం జరగాల్సిన ఇంట రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై జిల్లా ఇంఛార్జ్? మంత్రి నిమ్మల రామానాయుడు, పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ విచారం వ్యక్తం చేశారు.

## అరచేతిలో స్వర్గం, వెళ్లి చూస్తే నరకం

వసతి సౌకర్యాలు కల్పించడం లేదని ఏజెంట్లకు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని గల్ఫ్? బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**నిబంధనలు పట్టించుకోకుండా**

కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ప్రొటెక్టర్ జనరల్ ఆఫ్ ఇమ్మిగ్రెంట్స్ వద్ద ఏజెంట్లు, కన్సల్టెన్సీ సంస్థలు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. అయితే ఏజెంట్లు, కన్సల్టెన్సీ సంస్థలు మాత్రం ఈ నిబంధనలను గాలికొదిలేశాయి. ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్న ఏజెంట్లు నిజామాబాద్? జిల్లాలో కేవలం పది మంది వరకే ఉన్నారు. అయితే అనుమతులు లేని ఏజెంట్ల సంఖ్యే ఎక్కువగా ఉంది.

**131 మంది అరెస్ట్**

రాష్ట్రంలోని ఒక్కో జిల్లాలో 120 మంది వరకు నకిలీ ఏజెంట్లు ఉన్నారు. అయితే వీరంతా గల్ఫ్? దేశాలకు వెళ్లాలనుకునే వారి నుంచి రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వసూలు చేస్తున్నారు. ఆ మొత్తాన్ని, ముంబయి, దిల్లీ నగరాల్లోని ఏజెంట్లకు ఇస్తారు. వారి ద్వారానే గల్ఫ్ దేశాలకు పంపిస్తారు. తర్వాత వారి నుంచి కమీషన్ పొందుతారు. నిజామాబాద్ జిల్లాలో గత రెండు సంవత్సరాల వ్యవధిలో ఇలాంటి నకిలీ ఏజెంట్లపై 40కి పైగా కేసులు నమోదయ్యాయి. 131 మందిని అరెస్ట్ చేశారు.

**ఫిర్యాదు చేస్తే చర్యలు**

విదేశాలకు పంపించే ఏజెంట్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్? సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. మోసపోయిన వారు ఫిర్యాదు చేస్తే సంబంధిత ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గల్ఫ్ ఏజెంట్లుగా చెప్పుకొనే వారికి గదులు అద్దెకు ఇచ్చే యజమానులు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఏజెంటుగా అన్ని అనుమతులు ఉంటేనే గదులు అద్దెకు ఇవ్వాలని వెల్లడించారు.

## ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల

రైతులు నష్టపోకుండా ఉండేందుకు ముందస్తు సాగు విధానాన్ని కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. దీనికోసం గోదావరి డెల్టా కు ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ఒకరోజు ముందే సాగునీరు విడుదల చేసిందన్నారు. ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మంత్రి కందుల దుర్గేష్ కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు గోదావరి డెల్టాకు నీరు విడుదల చేస్తున్నట్లు మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు.

**రైతులు నాట్లు తొందరగా వేసుకోవాలని సూచన**

ప్రస్తుతం తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు నీరు విడుదల చేస్తున్నామని, 15 రోజుల్లో కాలువల మరమ్మతులు పూర్తి కాగానే దశలవారీగా మిగిలిన కాలువలకు నీరు విడుదల చేస్తామన్నారు. ముందస్తు నీటి విడుదల వల్ల ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ముందుగానే వరి సాగు చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. రైతులు నాట్లు తొందరగా వేసుకోవాలని, తద్వారా తుపానులు రాకముందే పంట త్వరగా చేతికందుతుందని మంత్రి కందుల దుర్గేశ్ ఈ సందర్భంగా రైతులందరికీ సూచించారు. రెండు రోజుల క్రితం ఇక్కడికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఇక్కడి నీటి కాలుష్యాన్ని తగ్గించే విధంగా పంచాయతీ రాజ్ శాఖ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తరఫున వంద కోట్లు రూపాయలు ఇస్తామని ప్రకటించినందుకు ధన్యవాదాలని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం వచ్చే ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతన్నలందరూ నాట్లు వేసుకుని, పంట పండించుకోవడంతో పాటు సంక్షేమంగా ఉండాలని కోరుకుంటున్నామని మంత్రి కందుల దుర్గేశ్ రైతులందరికీ విజ్ఞప్తి చేశారు.

## బిల్డింగ్ కూలి నలుగురు మృతి..



**టి మీడియా, మే 31, ఢిల్లీ బ్యూరో :** ఐదంతస్తుల బిల్డింగ్ కూలిన ఘటనలో నలుగురు మరణించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిలో పది మందిని రక్షించారు. సుమారు 16 గంటలకుపైగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. దక్షిణ ఢిల్లీలోని సాకేత్ మెట్రో స్టేషన్ సమీపంలోని ఐదు అంతస్తుల భవనం శనివారం సాయంత్రం కూలిపోయింది. పోలీసులు, అధికారులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు పది మందిని కాపాడారు. నలుగురు వ్యక్తుల మృతదేహాలను బయటకు తీశారు. కాగా, కూలిన ఐదంతస్తుల బిల్డింగ్‌లో ఒక కోచింగ్ ఇన్‌స్టిట్యూట్, కేఫ్‌లు, పలు కార్యాలయాలు ఉన్నాయి. పని దినాల్లో ఆ భవనంలో సుమారు 200 నుంచి 300 మంది వరకు ఉద్యోగులు ఉండేవారని స్థానికులు తెలిపారు. వారాంతం కావడంతో ఎక్కువ మంది మరణించే ప్రమాదం తప్పిందని చెప్పారు. ఆ బిల్డింగ్ పై అంతస్తులో నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. మరోవైపు వైద్య ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు తరచుగా వచ్చే బిల్డింగ్ పక్కనే ఉన్న రేకుల షెడ్డు క్యాంటీన్‌పైనా శిథిలాలు పడ్డాయి. దీంతో ఎంత మంది చిక్కుకున్నారో అన్నది తెలియడం లేదు. భారీ యంత్రాలు, హైడ్రాలిక్ కట్టర్లు, కెమెరాలు, జాగిలాల ద్వారా శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించేందుకు రెస్క్యూ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ఆదివారం సంఘటనా స్థలాన్ని సందర్శించారు. పరిసరాల్లోని శిథిలావస్థలో ఉన్న, ప్రమాదకరమైన భవనాలను తనిఖీ చేసి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన అధికారులపైనా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కూలిన బిల్డింగ్ యజమానిపై మానవ హత్యతో పాటు పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అతడ్ని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

## పర్యాటక ప్రాంతంలో కాల్పుల కలకలం..



**టి మీడియా, మే 31, సిమ్లా:** ప్రముఖ పర్యాటక ప్రాంతంలో తుపాకీ కాల్పులు కలకలం రేపాయి. రెండు వర్గాల మధ్య జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో పంజాబ్‌కు చెందిన ఒక పర్యాటకుడు గన్‌తో కాల్పులు జరిపాడు. స్థానికుడైన వ్యక్తి కాలికి బుల్లెట్ తగడంతో గాయమైంది. హిమాచల్ ప్రదేశ్‌లోని కుల్లు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పర్యాటక ప్రాంతమైన కసోల్ పర్యాటకులతో సందడిగా మారింది. కాగా, శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో ప్రసిద్ధ గ్రీన్ వ్యాలీ హోటల్‌లో ఒక విషయంపై రెండు వర్గాల మధ్య వాగ్వాదం చెలరేగింది. అది ఘర్షణగా మారడంతో పంజాబ్‌కు చెందిన ఒక పర్యాటకుడు పిస్టల్ తీసి కాల్పులు జరిపాడు. అయితే స్థానికుడైన వ్యక్తి కాలికి తగలడంతో గాయమైంది. దీంతో బాధతో అతడు కుప్పకూలిపోయాడు. ఆ తర్వాత హోటల్ పార్కింగ్ ప్రాంతం నుంచి ఆ వ్యక్తి బయటకు వెళ్తుండగా కాల్పులు జరిపిన పర్యాటకుడు చేతిలోని గన్‌తో అనుసరించాడు. అతడు మరోసారి పిస్టల్ గురిపెట్టగా పంజాబ్‌కు చెందిన ఇతర పర్యాటకులు అడ్డుకున్నారు. ఇంతలో గాయపడిన వ్యక్తిని మరో స్థానికుడు వీపుపై మోసుకుని అక్కడి నుంచి తీసుకెళ్లాడు. ఆ తర్వాత అతడ్ని ఆసుపత్రికి తరలించారు. మరోవైపు కాల్పుల సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. పంజాబ్‌కు చెందిన నలుగురు పర్యాటకులను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం పోలీసులు వెతుకుతున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. కాల్పులకు కారణం ఏమిటన్నది దర్యాప్తు చేస్తున్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## ఘోర రోడ్డు ప్రమాదం..

- స్పాట్‌లోనే ఐదుగురు కూలీలు మృతి




**టి మీడియా, మే 31, చిక్కబల్లాపుర :** కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో ముందున్న కంటెనర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరో వ్యక్తి మరణించాడు. బాధితులంతా రోజువారి కూలీలుగా పోలీసులు గుర్తించారు. కూలీ పనులు ముగించుకొన ఇంటికి వెళ్తుండగా కారు ఢీకొని ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కర్ణాటక రాష్ట్రంలోని చిక్కబల్లాపుర జిల్లాలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానికంగా నివాసం ఉంటున్న కొందరు కూలీలు పనులు ముగించుకొని ఆటోలో ఇంటికి వెళ్తున్నారు. అయితే ఆటో బాగేపల్లి సమీపంలోని సుంకాలమ్మ దేవాలయం వద్దకు రాగానే వెనక నుంచి వేగంగా వచ్చిన ఓ కారు ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొట్టింది. ఆ కంటైనర్ మరో వాహనాన్ని ఢీకొట్టింది. వెనక ముందు నుంచి బలంగా ఢీకొట్టడంతో ఆటో రెండు వాహనాల మధ్యలో చిక్కుకొని నుజ్జునుజ్జు అయిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఉమాదేవి (55), విజయమ్మ (40), లక్ష్మమ్మ (50), సరోజమ్మ (43) సహా ఆటో డ్రైవర్ అంజినప్ప (33) సైతం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఇక మిగతా వాహనాల్లో ఉన్న మరో 10 మంది కూడా తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన వాహనదారులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకన్న పోలీసులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం ఆటోలో చిక్కుకున్న మృతదేహాలను వెలికి తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. అయితే గాయాలతో హాస్పిటల్‌లో చేరిన మరో వ్యక్తి కూడా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. ఇక ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సామాన్య ప్రయాణికుడిలా రైలెక్కిన మంత్రి జూపల్లి



**టి మీడియా, మే 31, సికింద్రాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం (మే 31) సామాన్య ప్రయాణికుడిలా రైలు ప్రయాణం చేశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు బయలుదేరిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆయన ప్రయాణించారు. రైలులో ప్రయాణిస్తున్న సమయంలో మంత్రి జూపల్లి తోటి ప్రయాణికులతో ఎంతో ఆప్యాయంగా ముచ్చటించారు. వందే భారత్ రైలులో అందుతున్న సేవలు, సౌకర్యాల గురించి ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఒక రాష్ట్ర మంత్రి తమతో కలిసి ప్రయాణించడమే కాకుండా, సాధారణ ప్రయాణికుడిలా కలిసిపోవడంతో రైట్ క్లిక్‌లో తోటి ప్యాసింజర్లు ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి జూపల్లి సరళతకు సంబంధించిన ఈ ప్రయాణ విశేషాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.



## గాజువాకలో రోడ్డు ప్రమాదం

- ముగ్గురు మృతి

**టి మీడియా, మే 31, గాజువాక :** విశాఖలోని గాజువాక పోలీస్?స్టేషన్ సమీపంలో ఇవాళ ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాజమహేంద్రవరం నుంచి పార్వతీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆగిఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా, 9 మందికి గాయాలయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులు డ్రైవర్ రాంబాబు (50), గంగులు (70), లెంక ఈశ్వరమ్మగా గుర్తించారు. క్షతగాత్రులను కేజీహెచ్?కి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గాజువాకలో బస్సు ప్రమాదంపై రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్?రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. కేజీహెచ్‌లో చికిత్సపొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బాధిత కుటుంబాలకు ఆర్టీసీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రమాద కారణాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలనిఅధికారులకుమండిపల్లి ఆదేశాలిచ్చారు. గాజువాక బస్సు ప్రమాదంపై ఆర్టీసీ ఛైర్మన్ నారాయణరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ముగ్గురు మృతిచెందడం బాధాకరమని చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రయాణికుల భద్రతకు ఆర్టీసీ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని నారాయణరావు వెల్లడించారు.



## ముగ్గురు భక్తుల మృతి

**-కేదార్‌నాథ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత**

**టి మీడియా, మే 31, ఢిల్లీ బ్యూరో :** ఉత్తరాఖండ్‌లో సాగుతున్న కేదార్‌నాథ్ యాత్ర సందర్భంగా విషాదం చోటు చేసుకుంది. వాతావరణం సరిగ్గా లేకపోవడం, అనారోగ్యం కారణంగా ముగ్గురు భక్తులు మరణించారు. వారిలో ఒకరు తెలంగాణకు చెందిన భక్తుడు ఉన్నాడు. భారీ వర్షాలు, కొండ చరియలు విరిగిపడటం వంటి కారణాలతో కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొండ చరియలు విరిగిపడటం వంటి కారణాలతో యాత్ర సాగడం లేదు. దీంతో ఎక్కడికక్కడ యాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ (ఎస్ఈఓసీ) వెల్లడించింది. మృతులు ముగ్గురు రుద్రప్రయాగ్ ప్రాంతంలోనే ప్రాణాలు కోల్పోయారు. బాధితుల్లో గోపాల్ మిశ్రా (76) యాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా అనారోగ్యం కారణంగా మరణించారు. నవగంజి లక్ష్మన్‌జీ ఠాకూర్ (52) అనే వ్యక్తి యాత్రకు వెళ్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన బలగాని బలరాజ్ (49) కూడా అనారోగ్యం కారణంగా మరణించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అక్కడ వాతావరణ సరిగ్గా లేకపోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. భక్తులు వెళ్లే రూట్లను మూసివేసి, వారికోసం వసతులు ఏర్పాటు చేశారు. శనివారం నుంచి రుద్రప్రయాగ్ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనివల్ల భక్తులు వెళ్లే మార్గంలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉంది. అందుకే తాత్కాలికంగా యాత్రను నిలిపివేశారు. మళ్లీ వాతావరణం సాధారణ స్తితికి వచ్చిన తర్వాతే యాత్రను తిరిగి ప్రారంభిస్తారు. ఈ మేరకు జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీచేశారు. ఈ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భక్తులు అధికారులు సూచించిన చోట మాత్రమే ఉండాలని కోరారు.




## సరిహద్దులు దాటిన ప్రేమకథ

- ప్రియురాలిని కలవడానికి వచ్చి

**టి మీడియా, మే 31, ఢిల్లీ బ్యూరో :** ప్రేమ కోసం ఎంతటి సాహసానికైనా సిద్ధపడతారని చెప్పడానికి నిదర్శనంగా ఒక వింత ఘటన వెలుగులోకి వచ్చింది. కేవలం ఒక అమ్మాయిని కలవడం కోసం నియంత్రణ రేఖ దాటి భారత సరిహద్దుల్లోకి ప్రవేశించిన ఒక పాక్ ఆక్రమిత కాశ్మీర్ పౌరుడిని భారత సైన్యం అరెస్ట్ చేసింది. సరిహద్దులు దాటిన ప్రేమకథ.. ప్రియురాలిని కలవడానికి వచ్చి దొరికిపోయిన పాక్ యువకుడుప్రేమ కోసం ఎంతటి సాహసానికైనా సిద్ధపడతారని చెప్పడానికి నిదర్శనంగా ఒక వింత ఘటన వెలుగులోకి వచ్చింది. కేవలం ఒక అమ్మాయిని కలవడం కోసం నియంత్రణ రేఖ దాటి భారత సరిహద్దుల్లోకి ప్రవేశించిన ఒక పాక్ ఆక్రమిత కాశ్మీర్ పౌరుడిని భారత సైన్యం అరెస్ట్ చేసింది. ఈ సైనిక చర్య ఆదివారం (మే 31, 2026) ఉదయం సుమారు 9:30 గంటల ప్రాంతంలో జరిగింది. సియాల్‌కోట్ సరిహద్దును దాటి భారత భూభాగంలోకి ప్రవేశించిన సదరు పౌరుడిని సైన్యానికి చెందిన 12 గ్రెనేడియర్స్ యూనిట్ అదుపులోకి తీసుకుంది.

నిఘా వర్గాల నివేదికల ప్రకారం.. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ముజఫరాబాద్ జిల్లా, పైన్‌కాడి గ్రామానికి చెందిన లాల్ దిన్ మీర్ కుమారుడు జీషాన్ అహ్మద్ మీర్ (22) అనే యువకుడిగా అనుమానితుడిని గుర్తించారు. ఇతను బారాముల్లా జిల్లాలోని ఊరి పోలీస్ స్టేషన్ పరిధిలోని టిలై గ్రామానికి చెందిన అబ్దుల్ మజీద్ మీర్ కుమార్తె ఇరమ్ బానో అనే అమ్మాయితో ప్రేమ వ్యవహారం నడుపుతున్నాడు. కేవలం ఆమెను కలుసుకోవాలనే ఉద్దేశంతోనే అతను ప్రాణాలకు తెగించి సరిహద్దులు దాటినట్లు విచారణలో తేలింది. భారత సైన్యం సదరు యువకుడితో పాటు ఇరమ్ బానోను కూడా తమ అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం భారత సైన్యంతో పాటు, వివిధ నిఘా సంస్థల అధికారులు కూడా వీరిద్దరిని తీవ్రంగా విచారిస్తున్నారు. ప్రముఖ హిం దీ న్యూస్ ఛానల్ కథనం ప్రకారం, జీషన్‌కు సంబంధించిన పాకిస్తానీ జాతీయ గుర్తింపు కార్డు (:8260103931149, పుట్టిన తేదీ: 03/04/2004) సహా ఇతర కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ డాక్యుమెంట్లలో అతని పేరు ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో రాయబడి ఉంది. వీరిద్దరిని సైన్యం అదుపులోకి తీసుకుని విచారిస్తున్న ఒక వీడియో కూడా ప్రస్తుతం బయటకు వచ్చింది. కేవలం ఇదొక ప్రేమ వ్యవహారమేనా లేక దీని వెనుక ఏదైనా కుట్ర కోణం ఉందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు.